నేడు కరెంటు ఉండని ప్రాంతాలు..



సనత్‌నగర్: లోధా, ప్రకాష్‌నగర్, హెచ్‌పీఎస్, ఆల్విన్, సంజీవయ్యపార్కు, గ్రీన్‌ల్యాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 10 నుంచి 11.30 వరకు దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్, వెల్‌నెస్ హాస్పటల్ వెనుక ప్రాంతం, అభిరుచి హోటల్, డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్‌ఆర్‌టీ పార్ట్, టీవీఎస్ షోరూంలేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డి-మార్ట్ ఏరియా, చిరాన్‌పోర్ట్, హుడా లేన్
- ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు బ్రాహ్మణవాడీ, బేగంపేట బస్తీ, మాతాజీనగర్, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, అల్లావుద్దీన్ కోఠి
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గురుమూర్తిలేన్, తాతాచారికాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, బొంబే హల్వా కాంపౌండ్,
- ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సుందర్‌నగర్ కాలనీ, మోడల్‌కాలనీ, సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్, పోలీసు క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, అల్లావుద్దీన్ కోఠి, ఓల్టాస్, టయోటా షోరూం లేన్, కామత్‌లింగాపూర్, ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంక్
- మధ్యాహ్నం 1.30 నుంచి 3 గంటల వరకు శ్రీనివాసా టవర్స్, అమోఘ ప్లాజా, మేటాస్, బ్లూమూన్ హోటల్, మనీల్యాండ్ చైనా, సూర్యోదయ కాంప్లెక్స్, నల్లి సిల్క్స్ శారీస్ ఏరియా
- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు స్వప్న నర్సింగ్‌హోమ్, నిషాంత్‌బాగ్, కీర్తిలాల్ జ్యువెలర్స్, బాబూఖాన్ మాల్, అమృత మాల్, మయూరిమార్గ్, అల్లంతోటబావి, గీతాంజలి స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లాలాపేట్ ఫీడర్ పరిధిలోని వినోబానగర్, ఇందిరానగర్, లాలాపేట్, గణేష్ టెంపుల్ ఇసుకబావి ప్రాంతాల్లో

- మధ్యాహ్నం 12.30 నుంచి 3.15గంటల వరకు చెన్నారెడ్డి ఫీడర్ పరిధిలోని లంబాడీబస్తీ, కనకదుర్గ అపార్ట్‌మెంట్, సండే మార్కెట్, విజయ డైరీ, గరోండా అపార్ట్‌మెంట్, డేవిడ్ మెమోరియల్ కాలేజ్ ప్రాంతాల్లో
- ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆర్టీసీ ఫీడర్ పరిధిలోని ఆర్టీసీ ఆస్పత్రి, ఎన్‌ఐఎన్, తార్నాకా, టెలిఫోన్ ఎక్స్చేంజ్, హుడా, హెచ్‌ఎండీఏ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆక్రమణలపై అధికారుల్లో కదలిక

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

- రక్షణ స్థలాల్లో అక్రమ నిర్మాణాల గుర్తింపు
- పోలీసులతో కలిసి జాయింట్ యాక్షన్



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు, పోలీసులు

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో అక్రమార్కుల ఆగడాలపై 'పోలీసులనే బెదిరిస్తున్నారు' పేరిట శుక్రవారం ప్రచురితమైన వార్తాకథనానికి భారీ స్పందన వచ్చింది. ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం నేపథ్యంలో వెలువరించిన కథనంతో బోర్డు అధికారుల్లో చలనం మొదలైంది. సీఈఓ మధుకర్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన క్షేత్రస్థాయి పర్యటనలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఏకంగా రక్షణ స్థలాలను కబ్జా చేసి పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు. ఏ-1 డిఫెన్స్ ల్యాండ్స్ కబ్జాకు గురి అయినట్లు ప్రాథమికంగా తేలడంతో స్థానిక మిలటరీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వనున్నట్లు సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. గతంలో బోర్డు ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టిన మళ్లీ నిర్మాణాలు వెలిసినట్లు గుర్తించారు. రక్షణ స్థలల్లో అక్రమ నిర్మాణాలు, వ్యాపారాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేంది లేదని పేర్కొన్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపు

జాతీయ రహదారి -44 వెంబడి ట్రాఫిక్‌కు అంతరాయంగా వెలిసిన దుకాణాలపై ట్రాఫిక్ పోలీసులు, కంటోన్మెంట్ అధికారులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తొలగించారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించారు. సుచిత్ర చౌరస్తా సమీపంలోని షెడ్‌లు ఏ-1 డిఫెన్స్ స్థలంలోనివిగా గుర్తించి, మిలటరీ అధికారులకు సమాచారం ఇచ్చారు. బోయిన్‌పల్లి చెక్ పోస్టు సమీపంలో రక్షణ శాఖకు చెందిన ఓల్డ్ గ్రాంట్ బంగళా స్థలంలో నూతనంగా వెలిసిన నిర్మాణాలను సైతం పరిశీలించారు. త్వరలోనే ఆయా అక్రమ నిర్మాణాలను సైతం తొలగిస్తామని బోర్డు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, కంటోన్మెంట్ పరిధిలోని ఓల్డ్ గ్రాంట్ బంగళా (రక్షణ స్థలంలో) వెలిసిన రెస్టారెంట్‌కు సంబధించి మేడ్చల్ జిల్లా నుంచి లైసెన్సులు తీసుకోవడం గమనార్హం.

దళారులను నమ్మి మోసపోవద్దు

కంటోన్మెంట్ పరిధిలో చేపట్టే ఎలాంటి నిర్మాణానికైనా బోర్డు నుంచి అనుమతి తీసుకోవడం తప్పనిసరి, దళారుల మాటలు నమ్మి అక్రమ నిర్మాణాలు చేపట్టవద్దని, అలాంటి నిర్మాణాలను లీజుకు తీసుకుని వ్యాపారాలు పెట్టి నష్టపోవద్దని హెచ్చరిస్తున్నాం. రక్షణ స్థలాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు. స్థలం, నిర్మాణాలకు సంబంధించి వ్యాపారులకు ఏవైనా సందేహాలుంటే బోర్డు అధికారులను సంప్రదించి, నివృత్తి చేసుకోవాలి.
– ఫణి కుమార్, కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్

ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

లాలాపేట: ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం, ఎరుకల ఉద్యోగు సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకల సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. నిజాంపేటలో నిర్మించిన ఏకలవ్య భవన్‌ను ప్రారంభించాలనీ మంత్రిని కోరారు. నాయకులు లోకిని రాజు, శ్రీరాం సదానందం, కుతాడి రవికుమార్,కోనేటి నర్సింహ,శ్రీరామ్ ఆనంద్ తదితరులున్నారు.

నేడు వినోభానగర్‌లో ఉచిత వైద్య శిబిరం

లాలాపేట: అప్సా, బ్లూ ఫౌండేషన్, జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్ కమ్యునిటీ హాల్లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అప్సా సంస్థ కోఆర్డినేటర్ మంజుల తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ వైద్య శిబిరంలో ఆర్థోపెడిక్, పీడియాట్రిక్,గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్,ఫిజియోథెరఫీ వైద్యులు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బేగంపేట బ్రాహ్మణవాడీలో పర్యటించిన కోట నీలిమ

సనత్‌నగర్: క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంలో కాంగ్రెస్ నేతలు అంకిత భావం, నిబద్ధత ముందుకుసాగుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బేగంపేట బ్రాహ్మణవాడీలో సమస్యలపై శుక్రవారం ఆమె పర్యటించారు. గత రెండు రోజుల క్రితం ఇక్కడి రోడ్డునెంబర్-2లో వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు స్థానిక నేత మునీర్‌ఖాన్ దృష్టికి తీసుకురాగా ఆయన సత్వరమే కోట నీలిమకు తెలియజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కారం జరిగేలా చూడాలని ఆమె అధికారులను కోరారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేస్తున్న టీఆర్‌ఎస్‌ఎంఏ ప్రతినిధులు

సనత్‌నగర్: ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్స్ (టీఆర్‌ఎస్‌ఎంఏ) అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్ ప్రతినిధులు వెస్ట్‌మారేడ్‌పల్లిలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి కూడా వారి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను కమర్షియల్ ట్యాక్స్ పరిధిలో చేర్చి ట్యాక్స్‌లు చెల్లించాలంటూ నోటీసులు పంపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా స్కూల్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌కు సుమారు 2.60లక్షల మంది విద్యార్థులకు 15.60 లక్షల రూపాయలు చెల్లిస్తున్నట్లు వివరించారు. కానీ తమ స్కూల్స్‌కు ఇప్పటివరకు ఫెడరేషన్‌లో సభ్యత్వం కల్పించలేదని, ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళితే స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ నుంచి తమకు అనుమతులు రావాలని సమాధానం చెబుతున్నారని వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీఆర్‌ఎస్‌ఎంఏ అధ్యక్షులు ఉమామహేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ సయీద్ అహ్మద్, ఉపాధ్యక్షుడు పవన్ పాథక్, సుధాకర్, ప్రశాంత్, శ్రీకాంత్ రాజు తదితరులు ఉన్నారు.

పన్నుల వసూళ్లలో ప్రత్యేక దృష్టి సారించాలి

జెడ్‌సీ రవికిరణ్



డిప్యూటీ కమిషనర్లు ఏఎంసీల సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌సీ రవికిరణ్

సికింద్రాబాద్: ఆస్తిపన్ను వసూలును వేగవంతం చేయడంపై జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ కోరారు. శుక్రవారం సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోన్ల పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, పన్నుల విభాగం అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో పెద్దమొత్తంలో ఆస్తిపన్ను బకాయిలను రాబట్టేందుకు సర్కిళ్లవారిగా డిప్యూటీ కమిషనర్లు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు సికింద్రాబాద్ జోన్ పరిధిలో రూ.153 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రూ. 273 కోట్లు వసూలు చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రెండు జోన్లలో కలిపి రూ.19 కోట్లు ఎక్కువ వసూలు చేసిన అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. గత సంవత్సరం ఎన్నికల వి. ధులు, కోడ్ కారణంగా వసూలు శాతం తగ్గిందని జడ్‌సీ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అవాంతరాలు లేని కారణంతో రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను బకాయిలను రాబట్టాలని రవికిరణ్ కోరారు. సమీక్ష సమావేశంలో వివిధ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు డి.సుభాష్‌రావు, ఖదీర్, మారుతీదివాకర్, రాజు, సమ్మయ్య, రజినీకాంత్‌రెడ్డి, ప్రశాంతి, నాగేశ్వర్, విద్యాధర్, పలు సర్కిల్ కార్యాలయాల అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యే తలసానికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్, ప్రధానోపాధ్యాయుడు

సనత్‌నగర్: సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చదువుపై దృష్టిసారించలేకపోతున్నారని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసి సనత్‌నగర్‌లోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ స్కూల్ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. మనబస్తీ మన బడి కార్యక్రమం కింద రెండో దశలో ఈ స్కూల్‌ను చేర్చినప్పటికీ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని చెప్పారు. 270 మంది విద్యార్థులు ఉన్న స్కూల్‌లో 10 తరగతి గదులు అవసరం ఉండగా, కేవలం 3 గదులు మాత్రమే ఉన్నాయని చెప్పారు. సరిపడా ఫర్నిచర్ కూడా లేదన్నారు. ప్రధానంగా టాయిలెట్స్ లేకపోవడంతో పక్కనే ఉన్న హైస్కూల్‌లోని టాయిలెట్స్‌ను వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. మంచినీటి సౌకర్యం కూడా లేదని పేర్కొన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 8 అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా స్కూల్ బిల్డింగ్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు కలర్స్ కూడా వేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్కూల్ సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటానని, సంబంధిత అధికారులను కూడా ఆదేశిస్తానని హామీనిచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మాచారి, బీఆర్‌ఎస్ నేత కొలను బాల్‌రెడ్డి, స్కూల్ సిబ్బంది భాస్కర్ తదితరులు ఉన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు అడ్డుగా మారిన చెట్ల కొమ్మలను అధికారులు తొలగించారు. జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్, ఎలక్ట్రికల్ అధికారులు సంయుక్తంగా చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియ చేపట్టారు.



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేం

పంజగుట్ట: బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ట్యాంక్‌బండ్, జలదృశ్యంలో మూడు తరాల ఉద్యమ యోధుడు ఆచార్య కొండ లక్ష్మణ్‌బాపూజీ 12వ వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ తొలి, మలి దశ మూడు తరాల ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. తెలంగాణ కోసం ఆయన మంత్రి పదవి నే తృణప్రాయంగా వదిలేశారని, ఆయన సేవలు ఎన్నటికీ మరువలేమన్నారు.

కృష్ణకుమారికి ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సైకాలజీ విభాగం నుంచి తన్నీరు కృష్ణకుమారి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. ఎన్‌ఐఎన్ సైంటిస్టు డాక్టర్ సిల్వాయి ఫెర్నాండెజ్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన కృష్ణకుమారి 2014లో కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీలో గోల్డ్‌మెడల్ సాధించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌కు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి పాల్గొన్నారు.

మహిళా బాక్సర్‌కు సత్కారం



సికింద్రాబాద్: జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఇటీవల బంగారు పతకాన్ని సాధించిన సయ్యద్ ఆయేషాను శుక్రవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ అభినందించారు. బంగారు పతక గ్రహీత సయ్యద్ ఆయేషా తన కోచ్ మనోజ్ రెడ్డితో కలిసి సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీలో సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్ సామల హేమ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.25 లక్షల వ్యయంతో ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న దేవీ నవరాత్రి వేడుకలరు దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్‌ఎస్ నాయకులు కరాటే రాజు, రేవతి, సాయి, బీదబస్తీ సంక్షేమసంఘం ప్రతినిధులు సీతారాం, శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

23న ఉచిత ఫొటోగ్రఫీ వర్క్‌షాపు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ, భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాలార్‌జంగ్ మ్యూజియం, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన సైఫాబాద్‌లోని రవీంద్రభారతిలో 'ఫొటోగ్రఫీ'పై ఉచిత వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మెరుగు చంద్రశేఖర్ తెలిపారు.

కార్మికుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మాండవీయ



రోగులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి మాండవీయ

అమీర్‌పేట: దేశంలో వైద్య రంగం కొత్త పుంతలు తొక్కుతుందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డా.మాన్‌సుక్ మాండవీయ అన్నారు.సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ సూపర్ స్పెషాలిటీ,బోధనా ఆసుపత్రి, వైద్య కళాశాలలను శుక్రవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో' ఏక్ పేడ్ మాకే నామ్ పేరిట బిల్వ మొక్కలను నాటారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ప్రతీ కార్మికుడి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఈఎస్‌ఐసీ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు కీలకంగా వ్యవహరించనున్నాయని తెలిపారు. ఆసుపత్రుల్లో సేవలందించడానికి యువభారత్ ప్రతినిధులకు 30 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల డీన్ డా.శిరీష్ కుమార్ జి.చౌహాన్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.రాధిక యువభారత్ జిల్లా అధికారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా బీజేపీలో భాగస్వాములు కావాలి



దూద్‌బావి కమ్యూనిటీహాలు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: దేశం ప్రగతిపథంలో నడిచేందుకు ప్రజలంతా బీజేపీలో భాగస్వాములు కావాలని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి కోరారు. మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో శుక్రవారం పర్యటించిన ఆయన పలు ప్రజా సమస్యలపై స్పందించారు. దూద్‌బావి కమ్యూనిటీహాలు రెండవ అంతస్తు నిర్మాణానికి కేంద్రమంత్రి, సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డిరూ. 27 లక్షల సొంత నిధులు కేటాయించారని తెలిపారు. కమ్యూనిటీహాలు నిర్మాణపనులు పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సీమోర్చా,కిషాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సింగారపు నరేష్ మాదిగ, దేవుడుకుమార్, నాయకులు వనమాల శ్రీనివాస్, ఈఎల్ ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో గది కూల్చివేత



కూల్చివేత గది ముందు ఆందోళనకు దిగిన కార్పొరేటర్ కె. హేమలత

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ ప్రాంగణంలోని గదిని శుక్రవారం జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఆ గదిని బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారనే ఫిర్యాదు మేరకు కూల్చివేతలు నిర్వహించినట్లు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నర్సింగ్‌రావు చెప్పారు. అయితే ఈ విషయమై కార్పొరేటర్ హేమలత అభ్యంతరం వ్యక్తం చేశారు. గదిని ఎలా కూల్చివేస్తారంటూ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. ప్రజా ధనంతో నిర్మించిన గదిని ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు.

ఘనంగా వెల్లాల రామ్మోహన్ జన్మదిన వేడుకలు



వెల్లాల రామ్మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్

సనత్‌నగర్: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సనత్‌నగర్‌లోని ఆయన కార్యాలయానికి భారీగా తరలివచ్చి వెల్లాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి నడుమ బర్త్‌డే కేక్ కట్ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ తన రాజకీయ జీవితం ప్రజా సంక్షేమం కోసమేనని తెలిపారు. నిరుపేదల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్న బీజేపీలో కొనసాగుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్-మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, వివిధ పార్టీల నేతలు దయానంద్, కన్నూరి క్రాంతికుమార్, చంద్రకుమార్, నీలం రమేష్, మణిదీప్, మల్లారెడిడ, కళ్యాణ్, చలం, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొని వెల్లాల రామ్మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పార్కు స్థలాల కబ్జాపై హైడ్రాకు ఫిర్యాదు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని వెంకటేశ్వర కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో పార్కులకు కేటాయించిన ఖాళీ స్థలా లు ఆక్రమణకు గురయ్యాయని, దీనిపై దర్యాప్తు చేపట్టాలంటూ బాల్‌నర్సింగ్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆక్రమణదారులు తమ స్థలాలను జీఓ 59 కింద క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. లేఅవుట్‌లో ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణకు జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారిపై చర్యలు తీసుకుని వాటిని కూల్చివేయాలన్నారు. రోడ్లు, పార్కు లు, ఓపెన్ స్థలాలు ఈ కాలనీ లేఅవుట్‌లో చాలా వరకు కబ్జాకు గురయ్యాయన్నారు. ఎక్కడెక్కడ కబ్జాకు గురయ్యాయో తెలుసుకుని వాటిని కూల్చివేయాలని కోరారు. హెచ్‌ఎండీఏ స్థలాలు కూడా పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయన్నారు.

ద్రావిడ ధార్మిక పరిషత్ ఆవిర్భావం



ద్రావిడ ధార్మిక పరిషత్ ఆవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

లాలాపేట: ఈ దేశ మూలవాసుల హక్కుల సాధన కోసం ద్రావిడ ధార్మిక పరిషత్ (డీడీపీ) పేరుతో కొత్త సంస్థ ఆవిర్భవించింది. కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తార్నాకలో మాట్లాడుతూ విదేశీ ఆర్య సంతతికి చెందిన ఇండియా కూటమీ, ఎన్‌డీఏ కూటములు గత 78 సంవత్సరాలుగా ఈ దేశంలోని మూలవాసులైన ద్రావిడులను (ఎస్సీ,ఎస్టీ,బీసి, మైనార్టీలు) పరిపాలిస్తున్నారని, వారి నుంచి అధికారాన్ని సాధించడమే ద్రావిడ ధార్మిక పరిషత్ లక్ష్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ నంద్రు నర్సింహ్మారావు, జానీ, శంకర్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌కు విద్యార్థి నేతల అభినందనలు



ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు బీసీ విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లపెల్లి స్వామి గౌడ్ పుష్ప గుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. శుక్రవారం మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన విద్యార్థి నాయకులు కాంగ్రెస్ పార్టీ అన్ని కులాల సమగ్ర కులగణన జరిపించి, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు పరిచి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడుకొండలు, శ్రీకాంత్, మహేశ్, లాలు, ఆంజనేయులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మహంకాళి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. మహంకాళి దేవాలయం ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడివున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు.సిబ్బంది పరీక్షించి అప్పటికే చనిపోయాడని వెల్లడించారు. మృతదేహాన్ని గుర్తింపు నిమిత్తం గాంధీ మార్చురీలో భద్రపరిచారు.

వృద్ధుడు అదృశ్యం



రాంగోపాల్‌పేట్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కళాసీగూడకు చెందిన రిటైర్డ్ ఎంప్లాయి జంబుల విఠల్ (78) ఈ నెల 19వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి దగ్గర వెతికినా ఎక్కడ ఆచూకీ కనిపించకపోవడంతో మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వృద్ధుడు ఎక్కడైనా కనిపిస్తే మహంకాళి పోలీస్ స్టేషన్ నంబర్ 8712661253 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఆకట్టుకున్న హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ హాల్‌లో శుక్రవారం దస్తకారి ఆర్ట్స్ వారి క్రాఫ్ట్స్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రారంభమైంది. ఈ ఎక్స్‌పోను టాలీవుడ్ మూవీ డైరెక్టర్ సంజనారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, డిజైనర్లు, చేనేత ఔత్సాహికులతో ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సోమనాథ్ బౌమిక్ తెలిపారు.